బావొప్పుకో లేదు. "చెప్పేవా, మనసులో అనుకున్నావు కాబోలు. స్పష్టంగా చెప్పకూడదూ! నాకేం దివ్యదృష్టి లేదు తెలుసుకుందుకు."

"అవునులెండి" అక్కయ్యనుకొంది.

"కంటికి కునుకేనా వచ్చిందీ."

"ఏవిటే పారిపోతా ననుకున్నావా? చిన్న పిల్లవాడి నన్నట్టు మాట్లాడుతావేం? చాలా బాగుంది చాదస్తం. పొరుగింటి పోలీసు పెళ్ళానికి కూడా రిపోర్టియ్యాల్సింది, పరువుకూడా పోను."

ఎలా అంటారో...అక్కయ్య విస్తుపోయింది.

"ఇంకో పదినిమిషా లాలస్యంచేస్తే అంతా అయేదే లేదయ్యా...ఒప్పుకో తప్పును" అంటూ కాఫీగ్లాసుక్క తీసుకొచ్చాడు తమ్ముడు.

"ఏమిటయ్యా మరీను- మీ అక్కయ్య చెప్పా నంటుంది. నాకు తెలియదేదుమరి. ఎంత నాజూగ్గా చెప్పిందో! వెళ్ళాలనిపించింది. వెళ్లేను. ఇంత రాద్ధాంతం అని నాకేం తెలుసు. ఈపైన చెప్పే వెళ్ళాలిమరి."

బావ భోజనాని కుపక్రమించేడు.

"ఏవనుకొన్నావ్" అంటారు...ఏవనుకొంది? తనేవనుకొంది? ఓ పావుగంట ముందుకూ యిప్పటికీ ఎంత తేడా!

"అబ్బా..అలిసిపోయావ్...ఈ గుక్క పుచ్చుకో ముందు"... అక్కయ్య విస్తుపోయింది. ఆమెకి కోపంవచ్చింది. మెల్లిగా నవ్వుకొంది కాఫీగుక్క చప్పరిస్తూ.

"ఈ గుక్క మా బావ కోసం."

తమ్ముడు 'టోస్టు' ప్రొపోజ్ చేస్తున్నాడు.

---

స్కెచ్

# అదృశ్యుల ఆవాహన

వల్లూరి కృష్ణారావు

భోజనంచేస్తున్న మూర్తి యాథాలాపంగా అన్నాడు: "నిజంగా అదృష్టవంతుడు. అదృష్టం ఎవర్ని వరిస్తుందో ఎప్పుడు వరిస్తుందో తెలియదుకదా! నిన్నటిదాకా వాడు ఒక సాదామనిషి. ఈ రోజున లక్షాధికారి." ఈ మాటలు యాథాలాపంగానే అన్నాడుగాని భార్య వినాలని అన లేదు. భార్యకు అర్థంకాక తికమకపడి పులుసు గరిటె మజ్జిగగిన్నెలో పెట్టి మరుక్షణంలో తెప్పరిల్లి అక్కడనుంచే భర్తవంకచూస్తూ "ఎవరండీ?" అంది. మూర్తికూడా అప్పుడే తేరుకున్నాడు. తనమాటలు భార్య వింటోందని అర్థం చేసుకొని చెప్పడం మొదలెట్టాడు—

"పొద్దున్నే పైరొచ్చింది."

"ఎవరికి? ఎప్పుడు?"

"రామారావుకు నువ్వెరగవులే. ఇక్కడే పక్క పాలెం. కాసులేని సన్యాసి. వాడిప్పుడు లక్షకు నాథుడు."

"పాతు దొరికిందా?"

"నీ మొహం. డర్బీలో కట్టాడు."

"డర్బీ అంటే?"

"నీకు తెలియదు పోడు. లాటరీలో కట్టాడు. లక్షరూపాయిలు వచ్చాయి."

"వాడిపెళ్ళాం అదృష్టం!"

"మరి నా పెళ్ళాం అదృష్టం?"

"చూస్తున్నారుగా. రంగువెలిసిన నేతగుడ్డ! హు! నాదీ ఒక—"

"సరేలే."

భోజనంచేసి పడక కుర్చీమీద కూర్చున్నాడు. తిరిగి రామారావును గురించి ఆలోచిస్తున్నాడు. లక్షాధికారి! రామారావుమీద తగని అసూయ కలిగింది మూర్తికి.

భార్య భోజనం ముగించుకొని వచ్చింది. వేళ్ళ సందున ఉన్న సిగరెట్టు కాలుతూనే ఉందిగాని పీలవడు.

"ఇంకా అదే ఆలోచిస్తున్నారే! మనం వందాది కార్లు కూడా కాము రెండో తారీఖు ఒక క్షణం తప్ప." అంది భార్య, తాంబూలం వేసుకుంటూ.

"అదేచూస్తున్నాను. అదృష్టవంతులు అందరూ ఎందుకు కాలేరా అని?"

"అంతా అదృష్టవంతులయితే వాడిగొడవ మన కెందుకు కావాలి? మనం వాడిమాట తల పెడ్తామా? అయినా రోజూ లక్ష వైర్లు ఇచ్చి పుచ్చుకొనే టెల్లిగ్రాఫ్ గుమాస్తాగారికి ఈవేళ ఇలా పట్టిందేం బుద్ధి?" అంది భార్య, తన నాలిక ముందుకు చాచి చూచుకుంటూ—పండిందో లేదో అని.

ఇంకా అంది ఇలా—

"ఏమండీ! ఏదీ మీ నాలిక?"

"ఏడిశావు, వెధవనాలిక పండక పోతేనేం అదృష్టం పండాలిగాని! ఆ మాత్రం అదృష్టం కూడానా? నిన్ను చేసుకున్నాను. ఛస్తున్నాను."

"బాగానే ఉంది. వాడికి లక్ష రావడం కాదు గాని నాకు వచ్చింది చావు."

"అబ్బబ్బ! కాస్సేపు ఊరుకో."

"ఇప్పుడేమన్నానని. మీరుకూడా ఓ డబ్బికి కట్టెయ్యండి!"

"నీ మొహం. నువ్వు చెప్పావుకాదు అని." చిరాగ్గా అన్నాడు.

"క్షణం ఉండదు నిలకడ. ముక్కుమీద ఉంటుంది కోపం!" అంది భార్య లేస్తూ.

* * *

పోస్టాఫీసులో అంతా ఇదే గొడవ. రామారావు ఎంత బికారయినదీ, అదృష్టం ఒక్క అంగలో ఎలా రామారావుని కౌగిలించుకొన్నదీ వివరించి చెప్పుకున్నారు. ఇంకా లాటరీలమీద, పజిల్సుమీద, రేసులుమీద, బ్రాకెట్లమీద, లక్షలు క్షణంలో ఎలా కలిసివస్తాయో వాట్లమీద వెళ్ళాయి మాటలు ఆ రోజంతా! ఎవళ్ళకివాళ్ళు ఏవేవో అనుకున్నారు.

ఆ రాత్రి ఏం కేకలేశాడో ఏమో భయంగా అదిరిపడి భార్య అర్ధరాత్రివేళ "ఏమండీ, ఏమండీ!" అంటూ పదిమాట్లయినా కేకవేసి లేపింది, మూర్తి లేచాడు.

"ఎందుకు అలా అరుస్తారు?"

"ఎవరు?"

"ఎవరో అయితే మిమ్మల్నెందుకుకండీ లేపడం? ఏమిటండీ ఆ పలవరింతలు? భయంతో ఛస్తున్నాను."

"ఏంలేదు, శేషశాయి కల్లో కనపడ్డాడు."

"ఆయనెవరు?"

"ఏమో! సికింద్రాబాదుట."

"మీ స్నేహితులా?"

"ఉఁహు!"

"మీకు తెల్సా?"

"ఉఁహు!"

"బాగుందండీ! ఏమిటండీ ఈ వరస? నన్ను హడలగొడుతున్నారు."

"ఏమీలేదు, ఏం భయపడకు. శేషశాయి పోయాడు. వైరొచ్చింది."

"ఎవరికి?"

"వాళ్ళ చుట్టాలికి."

"ఊఁ"

"శేషశాయి అంటాడు కదా వచ్చి, ఎవడో రామారావుకు లక్ష లొస్తే నీ భార్యకు చెప్పావు నే పోతే ఎందుకు చెప్పలేదూ?—అంటాడు."

"ఇదెక్కడి గొడవండీ? రాత్రి ఇలా నాటకం కట్టారు. ఆ వెంకటేశ్వర్లుకు దండంబెట్టుకుని పడుకోండి."

"మరేం భయపడకు. చెప్పానుగా నీకు పడుకో."

"బాగానే ఉంది. ఇదేం ఉద్యోగమండీ!"

"వెధవ ఉద్యోగంలే. పడుకో."

తెల్లారి ఎనిమింటికి లేచాడు బద్ధకంగా. ఒక గంట లేటుగా వెళ్ళాడు ఆఫీసుకు.

ఇంటికి రాగానే నవ్వుతూ అన్నాడు: "శేషాద్రికి పెళ్ళి, రమేశం మెయిల్ లో వస్తున్నాడుట, సీతమ్మకు కొడుకు పుట్టాడుట, రాజారావు ఒక పార్టు తప్పాట్ట, సామాన్లు రిసీవు చేసుకోవాలట కోమలా కంపెనీవారు."

"ఏమిటండీ?"

"చెప్తున్నాను మరి వచ్చిన వైర్లు. మళ్ళీ రాత్రికి వీళ్ళంతా—"

"చాల్లెండి. భోజనానికి లేవండి." మూర్తి నవ్వుతూ బుద్ధిమంతుడిలా పీటమీద కూర్చున్నాడు.